సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



నీటి ట్యాంకర్లే దిక్కు 9లో▸

ఇంద్రవెల్లి మండలం గట్టిపల్లి పరిధి కొలాం గూడలో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఏటా వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తేనే గిరిజనుల అవసరాలు తీరుతాయి.

రంజాన్ వేళలు

మంగళ : ఇఫ్తార్ 6:31

బుధ : సహర్ 4:46

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.0/29.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపించనుంది.

న్యూస్‌రీల్

సేవే లక్ష్యంగా ముందుకు సాగాలి



హౌజ్‌సర్జన్లతో మాట్లాడుతున్న డైరెక్టర్ జైసింగ్

ఆదిలాబాద్‌టౌన్: హౌజ్ సర్జన్లు సేవే లక్ష్యంగా ముందుకు సాగాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. కొత్త హౌజ్‌సర్జన్లు సోమవారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు పనిచేసిన 101 మంది ఏడాది శిక్షణ కాలం ఆదివారంతో ముగిసింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే రోగుల బాధలను ఓపిగ్గా విని అవసరమైన చికిత్స అందించాలని సూచించారు. రిమ్స్‌కు వచ్చేది పేదలేనని, ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు.

సుహాసినిరెడ్డిని కలిసిన నగేశ్



సుహాసినికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నగేశ్

ఆదిలాబాద్: జెడ్పీ మాజీ చైర్ పర్సన్ చిట్యాల సుహాసినిరెడ్డిని బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ సోమవారం జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో నిర్వర్తించాల్సిన కార్యాచరణపై చర్చించారు. అలాగే పార్టీ సీనియర్ నాయకులు గందె విజయ్‌కుమార్, కృష్ణకుమార్‌ను నగేశ్ వారి నివాసం వద్ద కలిశారు. ఎన్నికల్లో తోడ్పాటు అందించాలని కోరారు.

నాన్‌స్లాబ్ మొబైల్ బిల్లింగ్ షురూ



మొబైల్ బిల్లింగ్ తీసి ఇస్తున్న ఎస్ఈ చౌహాన్

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ శాఖలో కేటగిరి–3కి సంబంధించి నాన్‌స్లాబ్ మొబైల్ బిల్లింగ్‌ను ఆ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ సోమవారం ప్రారంభించారు. ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్, ధస్నాపూర్, తదితర కాలనీల్లో వీటిని చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. ఇది వరకు గృహాలకు సంబంధించి మొబైల్ బిల్లింగ్ చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఫంక్షన్ హాళ్లు, షోరూంలు, విద్యాసంస్థలు, వాటర్ ప్లాంట్లు, పెట్రోల్ బంక్‌లు, కేటగిరి–3 కింద వచ్చే వాటన్నింటికి బిల్లులు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మొబైల్ ద్వారా బిల్లింగ్‌కు అనుసంధానం చేయడంతోబిల్లు రశీదు వస్తుందన్నారు. కార్యక్రమంలో డీఈ హరికృష్ణ, అకౌంట్ ఆఫీసర్ శంకర్, మావల ఏఈ జనార్దన్ రెడ్డి, సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

పైపులైన్ పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ప్రేమేందర్

కైలాస్‌నగర్: వేసవిలో పట్టణ ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని ఫిల్టర్ బెడ్‌లో పైపులైన్ మరమ్మతు పనులను సోమవారం పరిశీలించారు. పనుల ప్రగతిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పుర ప్రజలకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

బజార్‌హత్నూర్: వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉన్నందున వైద్యులు అందుబాటులో ఉండి వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య మహిళ కార్యక్రమ నిర్వహణ తీరుతో పాటు ఆసుపత్రిలో ప్రసవాల వివరా లు అడిగి తెలుసుకున్నారు. మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆమె వెంట వైద్యులు భీంరావ్, అల్లైఖ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గిన రాబడి



ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- గడిచిన ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో రిజిస్ట్రేషన్లు డౌన్
- శాఖ ఆదాయంపై తీవ్ర ప్రభావం
- గతేడాదితో పోల్చితే రూ.3కోట్లు తగ్గుదల

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం	ఆర్థిక సంవత్సరం	రిజిస్ట్రేషన్లు	ఆదాయం (రూ.కోట్లలో)
ఆదిలాబాద్	2022–23	10,085	36.03
	2023–24	9,588	31.94
బోథ్	2022–23	965	1.86
	2023–24	942	1.49

కైలాస్‌నగర్: జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 2023–24 ఆర్థిక సంవత్సరానికి గణనీయంగా తగ్గింది. గతేడాదితో పోల్చితే ఈ సారి రూ.3కోట్ల వరకు తక్కువగా సమకూరింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోవడం, అసెంబ్లీ ఎన్నికల ప్రభావంతో ఆశించిన స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరుగలేదు. దీనికి తోడు అనుమతి కలిగిన ప్లాట్లను మాత్రమే రిజిస్ట్రేషన్ చేయాలనే ప్రభుత్వ ఆదేశాలు సైతం తీవ్ర ప్రభావం చూపాయి.

తగ్గిన రిజిస్ట్రేషన్లు

జిల్లాలో రెండ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఆదిలాబాద్, బోథ్‌లో ఉన్నాయి. వీటి పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 53,076 రిజిస్ట్రేషన్లు జరిగాయి. రూ.13 కోట్ల 24లక్షల 77వేల ఆదాయం సమకూరింది. గతేడాది (2022–23)కి సంబంధించిన రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తే జిల్లా వ్యాప్తంగా 60,951 డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లు కాగా వాటి ద్వారా రూ.16కోట్ల 66లక్షల 94 వేల ఆదాయం సమకూరింది. గతేడాదితో పోల్చితే ఈ సారి 7,875 రిజిస్ట్రేషన్లు తక్కువ అయ్యాయి. అలాగే రూ.3.42 కోట్ల ఆదాయం తగ్గింది. ప్రధానంగా జిల్లా కేంద్రంలోనే ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. బోథ్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వ్యవసాయ పంటల ఉత్పత్తుల సీజన్‌లో మాత్రమే రిజిస్ట్రేషన్లు ఉంటాయి. అయితే ఈ ఆర్థిక సంవత్సరానికి గాను ఈ రెండు కార్యాలయాల్లోనూ ఆశించిన స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరుగలేదు. ఆదిలాబాద్‌లో ఈ సారి 9,588 రిజిస్ట్రేషన్లు కాగా వీటి ద్వారా రూ.31.94 కోట్ల ఆదాయం సమకూరింది. అలాగే బోథ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 942 రిజిస్ట్రేషన్లు జరుగగా రూ.1.49 కోట్ల ఆదాయం సమకూరడం గమనార్హం.

రియల్ ఎస్టేట్ ప్రభావం

రియల్ ఎస్టేట్ వ్యాపారం గతేడాదితో పోల్చితే ఈసారి జిల్లాలో భారీగా పడిపోయింది. భూములు, ప్లాట్ల క్రయ, విక్రయాలు ఆశించిన స్థాయిలో జరుగలేదు. దీనికి తోడు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన పోలీసు, ఎన్నికల అధికారుల విస్తృత తనిఖీల కారణంగా క్రయవిక్రయాలపై ప్రభావం చూపింది. భూములు, ప్లాట విక్రయాలు ఆశించిన స్థాయిలో జరుగలేదు. దీంతో రిజిస్ట్రేషన్లు భారీగా తగ్గాయి. దీనికి తోడు డీటీసీపీ అనుమతి కలిగిన లేఅవుట్లలోని ప్లాట్లను మాత్రమే రిజిస్ట్రేషన్ చేయాలనే ప్రభుత్వ ఆదేశాలు సైతం రిజిస్ట్రేషన్ల శాఖపై తీవ్ర ప్రభావం చూపిందనే అభిప్రాయాన్ని ఆ శాఖ అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

ఈ సారి రిజిస్ట్రేషన్లు తగ్గాయి

గతేడాదితో పోల్చితే జిల్లాలో ఈసారి రిజిస్ట్రేషన్లు భారీగా తగ్గాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోవడం, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన తనిఖీల కారణంగా భూములు, ప్లాట్లు, ఇళ్ల క్రయ విక్రయాలు మందగించాయి. నిబంధనల ప్రకారం లింక్ డాక్యుమెంట్స్ ఉన్న, డీటీసీపీ ఆమోదం కలిగిన లే అవుట్‌లోని ప్లాట్లను మాత్రమే రిజిస్ట్రేషన్ చేయాలనే ప్రభుత్వ ఆదేశాలు కొంత ప్రభావం చూపాయి. ఫలితంగా ఈ ఏడాది రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం తగ్గింది.

– విజయ్‌కాంత్‌రావు కులకర్ణి, సబ్‌రిజిస్ట్రార్, ఆదిలాబాద్

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

- బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ప్రజలకు చేసిందేమీలేదు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

కైలాస్‌నగర్: పార్టీ నాయకులు విభేదాలను పక్కనపెట్టి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. గడిచిన పదేళ్లలో బీఆర్ఎస్, బీజేపీలు ప్రజలకు ఏం చేయలేదన్నారు. అందుకే బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపించారన్నారు. 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, నల్లధనం వెలికి తీసి ప్రతీ పేదవాని ఖాతాలో రూ.15లక్షలు జమ చేస్తామని చెప్పిన మోదీ ప్రజలను మోసం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగాలిచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. నాయకులు, కార్యకర్తలు గడపగడపకు వెళ్లి పార్టీ అభ్యర్థి సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎంపీ అభ్యర్థి సుగుణ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సత్తు మల్లేశ్, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, దామోదర్‌రెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు కంది శ్రీనివాసరెడ్డి, ఆడే గజేందర్, శ్యాంనాయక్, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం పార్టీ ప్రచార రథలను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు.



ఇఫ్తార్‌లో పాల్గొన్న మంత్రి సీతక్క, ఎంపీ అభ్యర్థి సుగుణ తదితరులు

'ఇఫ్తార్'కు హాజరైన మంత్రి

రంజాన్ మాసం పురస్కరించుకుని ఆదిలాబాద్ పట్టణం బొక్కల్‌గూడలోని షాదీఖానాలో నిర్వహించిన ఇఫ్తార్‌కు మంత్రి సీతక్క హాజరయ్యారు. మైనార్టీ నాయకులతో పాటు విందుకు హాజరైన ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆదివాసీ ఆడబిడ్డను పార్లమెంట్‌కు పంపండి

ఇచ్చోడ: అభివృద్ధి చేసే కాంగ్రెస్ పార్టీని ఆదరించి, ఆదివాసీ ఆడబిడ్డను పార్లమెంట్‌కు పంపాలని మంత్రి సీతక్క కోరారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ప్రతీ సమస్యను ఎన్నికల తర్వాత పూర్తి చేస్తామని తెలిపారు. ఇందులో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు, ఎంపీ అభ్యర్థి సుగుణ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లేశ్, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, బోథ్ ఇన్‌చార్జి గజేందర్, నాయకులు అరుణ్, బోథ్ మార్కెట్ చైర్మన్ గంగారెడ్డి, తలమడుగు, బజార్‌హత్నూర్ జెడ్పీటీసీలు గణేశ్‌రెడ్డి, నరసయ్య పాల్గొన్నారు.

మాజీ మంత్రి భూమన్నను కలిసిన ఎంపీ అభ్యర్థి సుగుణ

కైలాస్‌నగర్: కాంగ్రెస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ సోమవారం మాజీ మంత్రి పడాల భూమన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డితో కలిసి పట్టణంలోని ద్వారకానగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన ఆమె అప్యాయంగా పలుకరించి శాలువాతో సత్కరించారు. ఆయన ఆరోగ్యంపై ఆరా తీయడంతో పాటు కాసేపు జిల్లా రాజకీయాలపై చర్చించారు. మాజీ మంత్రి ఆశీర్వాదం తీసుకున్నారు. వారి వెంట డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ తదితరులున్నారు.

నీటి ఎద్దడిపై నిర్లక్ష్యం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

- ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా అవసరమైతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, ఇంజినీరింగ్, సంబంధిత శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. తాగునీటి సరఫరా, బోర్లు, ఓపెన్ బావులు, నీటి వనరుల పనితీరు, నీటి ఎద్దడి కలిగిన గ్రామాలపై మండలాల వారీగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తీవ్ర నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని ఇంటింటికీ సరఫరా చేయాలన్నారు. పైపులైన్, మోటార్ల మరమ్మతులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరం పూర్తి చేయాలన్నారు. తాగునీటి సరఫరాలో వచ్చే చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. బోరుబావులు, పాత తాగునీటి వనరులను పునరుద్ధరించాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని వేసవి యాక్షన్ ప్రణాళికను రెండు రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీరు రాని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు సంబంధించిన పనులను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. విద్యార్థుల యూనిఫాంకు సంబంధించిన కొలతలను వారంలోగా సేకరించాలని ఆదేశించారు. అలాగే ఉపాధి పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, డీఆర్డీవో సాయన్న, ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మండల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా చర్యలు చేపట్టాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఐటీడీఏ పీవో

కైలాస్‌నగర్: ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. ఆయా జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. గరిష్ట ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీలుగా నమోదవుతున్న నేపథ్యంలో వడదెబ్బకు గురైన వారికి సత్వరమే ప్రథమ చికిత్స అందేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలన్నారు. అలాగే ఉపాధి హామీ పనులు ఉదయం వేళలోనే నిర్వహించాలన్నారు. తాగునీటి సరఫరా పర్యవేక్షించేందుకు మండల, గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు ధరతో కొనుగోలు చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్ వ్యసనంతోనే టోకరా

- 'పోస్టల్'ను బురిడీ కొట్టించిన ఐపీపీబీ మేనేజర్
- మరో అధికారి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ అక్రమంగా వినియోగం
- రూ.కోటి 13లక్షల రైతుల డబ్బులు తన ఖాతాలోకి..
- ఫ్రాడ్‌కు సహకరించిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అరెస్టు
- నిందితుడి మామ, భార్యనూ కేసులో చేర్చిన పోలీసులు



మోసపోయిన రైతుల పక్షాన ఐపీపీబీ అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్ (ఫైల్)

సాక్షి, ఆదిలాబాద్: రైతుల ఖాతాల్లోని డబ్బులను తన సొంత ఖాతాలోకి మళ్లించుకున్న ఇండియా పోస్టల్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) మేనేజర్ జాదవ్ విజయ్ కేసులో అక్రమ లీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. విజయ్ జుడీషియల్ కస్టడీ ఆదివారంతో పూర్తి కావడంతో పోలీసులు జిల్లా జైలుకు తరలించారు. ఆన్‌లైన్ గేమ్స్ వ్యసనంతోనే రైతుల డబ్బులను తన ఖాతాల్లోకి మళ్లించుకొని ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు తేలింది. మొత్తంగా 74 మంది రైతులకు చెందిన రూ.1కోటి 13లక్షలను ఇలా మళ్లించుకున్నట్లు గుర్తించారు. కాగా పోలీసుల విచారణలో ఈ మేనేజర్ పలు విషయాలు వెల్లడించినట్లు తెలుస్తుంది. దాని ఆధారంగా వన్‌టౌన్ పోలీసులు మరింత ముందుకెళ్లి ఈ దుర్వినియోగంలో నిందితుడికి సహకరించిన మరొకరిని అరెస్టు చేశారు. అలాగే కేసులో పాత్ర ఉన్నప్పటికీ పోలీసుల విచారణకు సహకరించకపోవడంతో నిందితుడి మామ, మేనేజర్ భార్యను ఈ కేసులో చేర్చారు. మొత్తంగా మేనేజర్‌తో కలుపుకొని నలుగురిపై కేసు నమోదైంది.

జిమ్మిక్కిలా..

పత్తిని అమ్మిన రైతులకు సంబంధించి డబ్బులను ఐపీపీబీ అకౌంట్లలో గత డిసెంబర్ నుంచి జమ అవుతూ వస్తున్నాయి. ఆన్‌లైన్ గేమ్స్ వ్యసనంలో మునిగిపోయిన జాదవ్ విజయ్ రైతుల డబ్బులను తన సొంత ఖాతాల్లోకి మళ్లించాలన్న దురాలోచన అమలు చేశాడు. పత్తిని అమ్మిన రైతులకు రూ.లక్షల్లో డబ్బులు ఖాతాల్లో జమ కావాలి. అయితే వాటికి సంబంధించి ప్రతిరోజు రూ.25వేలు మాత్రమే విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉందని చెబుతూ ఈ మేనేజర్ రైతులను బురిడీ కొట్టించాడు. మిగతా డబ్బులను రైతుల వేరే బ్యాంక్ అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేస్తానని చెప్పి నమ్మించాడు. ఇందుకోసం తన బంధువు అయిన చౌహాన్ పురుషోత్తంను రూ.10వేల వేతనంపై అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా నియమించుకున్నాడు. పురుషోత్తం పేరు మీద ఓ బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి అతని మొబైల్ నంబర్‌నే ఆ అకౌంట్‌కు అనుసంధానం చేశాడు. ఇక డబ్బుల విత్‌డ్రాలో జిమ్మిక్కులకు పాల్పడ్డాడు. రైతుల డబ్బులను వారి బ్యాంక్ అకౌంట్ నుంచి విత్‌డ్రా చేసేటప్పుడు బ్యాంకులో రైతుల ద్వారా ఫింగర్‌ప్రింట్స్ తీసుకొని వారి సెల్‌ఫోన్‌లకు వచ్చే ఓటీపీలను సేకరించాడు. ఆ తర్వాత తన పన్నాగాన్ని అమలుపర్చాడు. అప్పటికే పురుషోత్తం పేరిట తీసిన అకౌంట్‌లోకి ఆ డబ్బులను మళ్లించాడు. రైతులు తమ అకౌంట్‌లోకి డబ్బులు రావడం లేదని మేనేజర్‌తో ఆవేదన వ్యక్తం చేసినప్పుడు సర్వర్ ప్రాబ్లమ్‌తో సమస్య ఉందని, నిదానంగా ఖాతాల్లో డబ్బులు పడతాయని వారిని నమ్మించాడు. అది నిజమని వారు నమ్మారు. కాగా పురుషోత్తం అకౌంట్లో నుంచి తన పేరిట కెనరా, పేటీఎం, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ఐపీపీబీలో ఉన్న ఖాతాల్లోకి ఆ డబ్బులను మళ్లించుకున్నాడు. పురుషోత్తం సెల్‌నంబర్‌కు వచ్చే ఓటీపీలను విరివిగా ఉపయోగిస్తూ ఈ పన్నాగాన్ని సంపూర్ణం చేశాడు.

విత్‌డ్రా పవర్ లేకున్నప్పటికీ..

జిల్లా కేంద్రంలోని పోస్టల్ శాఖకు అనుబంధంగా ఇండియా పోస్టల్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) కొనసాగుతుంది. పోస్టల్ శాఖ మేనేజర్‌కు మాత్రమే డబ్బులు విత్‌డ్రా చేయించే పవర్ ఉందని పోలీసులు చెబుతున్నారు. ఈ ఐపీపీబీ మేనేజర్‌గా వ్యవహరిస్తున్న జాదవ్ విజయ్‌కు ఆ పవర్స్ లేవు. అయితే ఆ పోస్టల్ శాఖ మేనేజర్ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను తెలుసుకొని అక్రమంగా రైతుల డబ్బుల విత్‌డ్రా వ్యవహారంలో వినియోగించాడు. మొత్తంగా బ్యాంక్‌నే బురిడీ కొట్టించాడు. రైతులు ఆందోళనతో వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత ఐపీపీబీ చీఫ్ మేనేజర్ భాస్కర్ నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే పరారైన విజయ్ ఆ తర్వాత 15 రోజుల కిందట కోర్టులో లొంగిపోయాడు. అతడిని కస్టడీకి అనుమతి ఇవ్వాలని పోలీసులు కోర్టును అభ్యర్థించారు. వారు పది రోజుల కస్టడీకి అనుమతించారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారించారు. ఆదివారంతో ఇది ముగిసిపోయింది. విజయ్‌ను మళ్లీ జిల్లా జైలుకు తరలించారు.

మరిన్ని విషయాలు వెలుగులోకి..

పోలీసుల కస్టడీలో మేనేజర్ జాదవ్ విజయ్ పలు విషయాలను వెల్లడించారు. దాని ఆధారంగా వన్‌టౌన్ పోలీసులు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ ముగ్గురిలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి పురుషోత్తంను సోమవా రం అరెస్టు చేశారు. దీంతో పాటు నిందితు డు జాదవ్ విజయ్ భార్య ప్రభుత్వ ఉపాధ్యాయురాలైన రాథోడ్ మహేశ్వరి, ఆయన మామ అయిన ఇంద్రవెల్లి హెడ్‌కానిస్టేబుల్ రాథోడ్ నందులాల్‌ను ఈ కేసులో చేర్చారు. ప్రధానంగా వీరి పాత్ర ఉండడం, పోలీసుల విచారణకు సహకరించకపోవడంతో కేసులో చేర్చాల్సి వచ్చిందని వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. నందులాల్‌కు సంబంధించి 11 తులాలు, మహేశ్వరికి సంబంధించి 13 తులాల బంగారాన్ని జాదవ్ విజయ్ బ్యాంకులో కుదువపెట్టి గత ఫిబ్రవరిలో లోన్ తీసుకున్నాడు. రైతుల డబ్బులను అక్రమంగా కాజేసిన విజయ్ వాటిని బ్యాంక్‌కు కట్టి బంగారాన్ని కుదువ నుంచి విడిపించాడు. విచారణలో విషయం తెలుసుకున్న పోలీసులు ఆ బంగారం రికవరీ కోసం రాథోడ్ నందులాల్, రాథోడ్ మహేశ్వర్‌ను ఆశ్రయించారు. అయితే వారు సహకరించకపోవడంతో ఈ కేసులో చేర్చాల్సి వచ్చిందని పోలీసులు తెలుపుతున్నారు. కాగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి పురుషోత్తం నుంచి ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్‌లు, ఆరు క్రెడిట్ కార్డులు, ఒక బైక్, రైతుల వివరాలు రాసుకున్న డైరీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా ఈ కేసు సంచలనంగా మారింది.

క్లుప్తంగా

నగదు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నగదుతో ఎస్సై

జైనథ్: మండలంలోని భోరజ్ ఎక్స్‌రోడ్ వద్ద వాహన తనిఖీల్లో భాగంగా కారులో తరలిస్తున్న రూ.3,06,300 నగదును పట్టుకున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. పి.శ్రీనివాస్ ఇచ్చోడ నుంచి జైనథ్‌కు మ్యాక్స్ పికప్ వాహనంలో వెళ్తుండగా సోమవారం ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.3,06,300 నగదును స్వాధీనం చేసుకుని ఎఫ్ఎస్‌టీ టీం అధికారి ముత్యంరావుకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. అనంతరం పంచనామా చేసి నగదును ట్రెజరీలో జమ చేసినట్లు ముత్యంరావు తెలిపారు. ఏఎస్సై సిరాజ్, కానిస్టేబుల్ అనిల్, వీడియోగ్రాఫర్ నరేశ్ తదితరులు ఉన్నారు.

మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం

ఆదిలాబాద్‌టౌన్: సీసీఎస్ బృందం ఆధ్వర్యంలో సోమవారం రూ.9700 విలువ గల మద్యాన్ని పట్టుకున్నారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీలో గైక్వాడ్ మధుకర్ బెల్ట్‌షాపుపై దాడి చేసి రూ.2400 విలువ గల మద్యం పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. అలాగే పట్టణ వన్‌టౌన్ పరిధిలోని గాంధీనగర్ ప్రాంతంలో వాహనంపై మద్యం తరలిస్తున్న మామిడిగూడకు చెందిన మేశ్రం బాలాజీని పట్టుకుని, అతని వద్ద నుంచి రూ.7300 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఇరువురిపై ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసి స్టేషన్ బాధ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: లోకారిలో మాడ సాయిరెడ్డి వద్ద 11.8 లీటర్ల మద్యాన్ని సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బోథ్ మండలంలో..

బోథ్ మండలం నిగిని గ్రామంలో గుడుంబా స్థావరాలపై ఎస్సై రాము ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. జాదవ్ సుదర్శన్ వద్ద 5 లీటర్ల గుడుంబాతో పాటు బెల్లం, పటిక, ఇప్పపువ్వును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈమేరకు జాదవ్ సుదర్శన్ అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యమైంది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో పనికి వెళ్లివస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో సోమవారం టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్సై రమణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వడదెబ్బ.. తస్మాత్ జాగ్రత్త

- అత్యధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- ముందస్తు జాగ్రత్తలతో ఉపశమనం



మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్మానుష్యంగా లక్ష్మీ థియేటర్ చౌరస్తా

మంచిర్యాలటౌన్: వేసవికాలంలో మార్చిలోనే ఎండలు మండుతుండడంతో జనం ముస్ముందు పరిస్థితి ఇంకా ఎలా ఉంటుందోనని జనం బెంబేలెత్తుతున్నారు. ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత పెరుగుతోంది. జిల్లాలో ప్రతీరోజు 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో రోడ్లన్నీ ఉదయం 11 గంటల నుంచే నిర్మానుష్యంగా మారుతున్నాయి. జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం సమయంలో రోడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అత్యవసరమైతేనే ప్రజలు బయటకు వస్తున్నారు. ఏప్రిల్, మే నెలలో మరింతగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. నిర్లక్ష్యంగా ఉంటే ప్రజలు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంది.

ఎల్లో అలర్ట్..

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వాతావరణ శాఖ జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రజలు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వడదెబ్బ బారినపడే ప్రమాదం ఉందని, చిన్నారులు, వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు

- వేసవిలో డీహైడ్రేషన్ అధికంగా ఉంటుంది. రోజుకు కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి. భోజనం మితంగా చేయాలి.
- ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు నీడన/చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించండి.
- ఆల్కాహాల్/సిగరేట్/కార్బొనేటెడ్ వంటి ద్రావణాలకు దూరంగా ఉండండి.
- ఎండలో వెళ్లేటప్పుడు కళ్లకు సన్ గ్లాసెస్, తలకు టోపీ వంటివి ధరించండి.
- వేసవిలో ఉదయం/సాయంత్రం సమయాల్లో మాత్రమే బయటికి వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలి.
- వేడి వాతావరణంలో శారీరక శ్రమ కార్యక్రమాలు చేయడం మంచిది కాదు. ఒకవేళ చేస్తే ప్రతీ 20 నిమిషాలకు ఒకసారి 5 నిమిషాలు నీడలో ఉండేలా చూసుకోవాలి.
- ఆహారంలో ఎక్కువగా ద్రవపదార్థాలు ఉండేలా చూసుకోవాలి.
- ప్రయాణాల్లో సోడియం, ఎలక్ట్రోలైట్ వంటి ద్రావణాలను తాగడం మంచిది.

చేయకూడని పనులు

- మండు వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రత ఉన్న సమయంలో ఎక్కువగా తిరగరాదు.
- రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం తినవద్దు. ఇంట్లో వండుకున్నవి మాత్రమే తినాలి.
- మాంసాహారం తగ్గించి, తాజా కూరగాయల్ని ఎక్కువగా ఆహారంలో తీసుకోవాలి.
- నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను ఆహారంగా తీసుకోవాలి. పుచ్చకాయలు, కీరదోస, కర్బూజ, తాటి ముంజలు, బీరకాయలు, పొట్లకాయలు వంటి వాటిలో నీటి శాతం పుష్కలంగా ఉంటుంది. వీటి ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. దీని వల్ల కడుపు నిండినట్లుగా ఉండి, డైట్ కంట్రోల్ అవుతుంది.
- శీతల పానీయాలు, అధికంగా షుగర్ వేసిన జ్యూస్‌లు, మ్యాంగో, సపోటా వంటివి తీసుకుంటే బరువు తగ్గకపోగా, కొత్త సమస్యలు ఉత్పన్నమవుతాయి.
- వేసవిలో ఆకలి తక్కువగా దాహం ఎక్కువగా ఉంటుంది. జీర్ణక్రియలోనూ తేడాలు వస్తుంటాయి. డైట్ పాటిస్తూ కాలానికి అనుగుణంగా ఆహారపదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండి బరువును నియంత్రించవచ్చు. నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవాలి.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన వారిలో కాళ్ల వాపులు, కళ్లు తిరగడం, శరీర కండరాలు పట్టుకోవడం, తీవ్ర జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అధిక చెమట పట్టడం, తల తిరిగి పడిపోవడం వంటివి జరిగితే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి సత్వర వైద్యం అందించాలి.

ప్రాథమిక చికిత్స

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడకు తీసుకెళ్లాలి. చల్లని నీరు, ఐస్‌తో ఒళ్లంతా తుడవాలి.
- చల్లని గాలి తగిలేలా ఉంచాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరిబోండాం లేదా చిటికెడు ఉప్పు, చక్కెర కలిపిన నిమ్మరసం, గ్లూకోజు ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణం(ఓఆర్ఎస్) తాగించవచ్చు.
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్తే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించాలి.

బయటకు వెళ్లొద్దు



ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. పిల్లలు, వృద్ధులతో పాటు ప్రజలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండేందుకు ప్రయత్నించాలి. అత్యవసరమైతే తలకు టోపి ధరించి వెళ్లాలి. చెమట రూపంలో శరీరంలోని లవణాలు బయటకు పోతాయి. అందుకే లవణాలతో కూడిన ద్రావణం తీసుకోవాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాం. ఇంట్లోనే ఉండే పిల్లలకు వేడి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యాధికారి

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీ భర్త



మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన శ్రీధర్‌రెడ్డి

తాంసి: తాంసి ఎంపీపీ సురుకుంటి మంజుల భర్త శ్రీధర్‌రెడ్డి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఇచ్చోడలో జరిగిన కాంగ్రెస్ నాయకుల సమావేశానికి రాష్ట్రమంత్రి సీతక్క హాజరయ్యారు. ఆమె సమక్షంలో ఆయనతోపాటు గ్రామాలకు చెందిన 300 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరగా కండువాలు కప్పారు.

నాగోబా ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న కిరాణ్‌మాయి కొప్పిసెట్టి

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో సోమవారం నిజామాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ కిరాణ్‌మాయి కొప్పిసెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులతో మాట్లాడి ఆలయ చరిత్ర, నాగోబా టెంపుల్ నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ ఏవో రాంబాబు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్ తదితరులు ఉన్నారు.

రైతుల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న రైతులు

- గండిపడిన కాలువ పూడ్చివేత



కాలువ గండికి మరమ్మతు చేసిన ప్రాంతం

ఖానాపూర్: రైతులే స్వయంగా సోమవారం శ్రమదానం చేపట్టి గండిపడ్డ కాలువను పూడ్చివేశారు. పెంబి మండలం మందపల్లి, వేణునగర్ గ్రామాల సమీపంలోని కొత్తచెరువుకు డీ–28 కాలువ ద్వారా నీరు రావల్సి ఉంది. గత ఖరీఫ్‌లో కాలువకు గండి పడడంతో రాజూరాకు చెందిన డీపీసీ, ఆధ్వర్యంలో మరమ్మతు చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా అధికారులు అండర్ టన్నెల్ వద్ద శాశ్వత మరమ్మతు పనులు ప్రారంభించలేదు. కాగా, ఖానాపూర్ మండలం సింగాపూర్ వద్ద కాలువకు కొన్నిరోజుల క్రితం గండిపడింది. దీంతో చెరువులో నీరులేక రైతుల పంటపొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. మందపల్లి రైతులు విద్యుత్ మోటార్లతో పంటలకు నీరందించారు. నీరు సరిపోవడం లేదని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని రైతులు గంగారెడ్డి, మహేశ్, శ్రీనివాస్, సంజీవ్ వాపోతున్నారు. ఆయకట్టు పరిధిలోని 46 మంది రైతులు సొంత ఖర్చులతో జేసీబీ ద్వారా పనులు చేపట్టారు. శ్రమదానం చేసి కాలువ గండిని పూడ్చారు. ఈ విషయమై ఏఈఈ రవినాయక్‌ను వివరణ కోరగా, కాలువ అండర్ రిపేర్‌లో ఉండడం వల్ల రాజూరా, సింగాపూర్ వరకే నీటిని ఇస్తున్నామని, దిగువకు ఇవ్వలేదన్నారు. అయినప్పటికి మందపల్లి రైతులు నీటిని తీసుకుపోవడంతో కాలువకు గండిపడిందన్నారు. కాలువ గండి శాశ్వత మరమ్మతుకు ప్రతిపాదనలు పంపినా కోడ్ కారణంగా టెండర్ పిలవలేదన్నారు.

పసిడి @ 70వేలు

- పది గ్రాములు ధర
- మధ్య తరగతిపై పెనుభారం
- పనులు లేక స్వర్ణకారుల ఆందోళన

వారం నుంచి ధరలు ఇలా...

తేదీ	ధర(10గ్రాములు)
01/04	రూ.70,000
30/03	రూ.69,200
29/03	రూ.69,000
28/03	రూ.67,950
27/03	రూ.67,800
26/03	రూ.67,900
23/03	రూ.68,000
22/03	రూ.68,300



భైంసాటౌన్: పసిడి ధర రికార్డు స్థాయికి చేరుకుంది. సోమవారం మార్కెట్‌లో పది గ్రాముల బంగారం ధర రూ.70వేలు పలికింది. దాదాపు ఏడాదిలోనే ఏకంగా రూ.15 వేలకుపైగా ధర పెరిగి, సామాన్య, మధ్య తరగతి వారికి బంగారం కొనుగోలు పెనుభారంగా మారింది. ప్రస్తుతం పెళ్లిళ్ల, శుభకార్యాల సీజన్ కావడంతో బంగారం కొనుగోళ్లతో బంగారు, వెండి వర్తక దుకాణాలు సందడిగా ఉన్నా.. స్వర్ణకారులకు చేతినిండా పని లేక ఆందోళన చెందుతున్నారు. పసిడి ధర పైపైకి చేరుకుంటుండంతో వినియోగదారులు సైతం కొద్దిమొత్తం కొనుగోలుతోనే సరిపెట్టుకుంటున్నారు. ఫలితంగా స్వర్ణకారులకు సరిపడా పని లేక ఉపాధికి ఇబ్బంది పడుతున్నారు.

పని తగ్గింది



బంగారం ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ప్రస్తుతం పది గ్రాములు రూ.70వేలకు చేరింది. పెళ్లిళ్ల, శుభకార్యాల సీజన్ ఉన్నా చేతి నిండా పని ఉండడం లేదు. ధరలు పెరగడంతో అవసరమైన ఆభరణాలే చేయించుకుంటున్నారు. అదనంగా ఆభరణాలు చేయించుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో పని లేక ఇబ్బంది అవుతోంది.

– బ్రహ్మయ్యచారి, స్వర్ణకారుడు, భైంసా

అంత ధరతో కొనలేం

ఇంట్లో శుభకార్యం కోసం బంగారం కొనేందుకు వెళ్తే పది గ్రాములు రూ.70వేలు పలుకుతోంది. ఏడాది కిందట రూ.54వేలు ఉన్న ధర ఇప్పుడు ఏకంగా రూ.15వేల వరకు పెరిగింది. దీంతో మాలాంటి సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు బంగారం అందని వస్తువుగా మారింది.

– సవిత, గృహిణి, భైంసా

మొక్కజొన్న దగ్ధం



దగ్ధమైన పంటను చూపిస్తున్న అమీరొద్దీన్

కుంటాల: మండలంలోని ఓలా శివారు ప్రాంతంలో ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంట దగ్ధమైంది. సోమవారం వ్యవసాయ మీటర్ల సర్వీసులు చెక్ చేసేందుకు అసిస్టెంట్ లైన్‌మెన్ రవీందర్ వెళ్లారు. నూర్పిడి చేసేందుకు ఉంచిన మొక్కజొన్న కాలిపోతుండగా గమనించిన ఆయన రైతు అమీరొద్దీన్‌కు సమాచారమిచ్చారు. పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉడుత గూళ్లు పెట్టగా, అవి అటుఇటు వెళ్లే క్రమంలో విద్యుత్ తీగల మధ్య నుంచి నిప్పురవ్వలు పంటపై పడడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక రైతులు వచ్చి మంటలార్పి వేయడంతో ప్రమాదం తప్పింది. రూ.30 వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో గోల్డ్‌మెడల్



గోల్డ్ మెడల్ అందుకుంటున్న జిల్లా క్రీడాకారులు

నేరడిగొండ: సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటి గోల్డ్‌మెడల్ దక్కించుకున్నారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్ డివిజన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గతనెల 29 నుంచి సోమవారం వరకు 36వ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ బాల,బాలికల చాంపియన్ షిప్ 2023–24 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో తెలంగాణ జట్టు పంజాబ్‌పై 3–1 తేడాతో గెలుపొంది విజేతగా నిలిచింది. ఈ జట్టులో ఆదిలాబాద్ జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. నేరడిగొండలో 8వ తరగతి చదువుతున్న మంకాని ఆరుషి, కేజీబీవీ విద్యార్థినులు శ్రీలేఖ, అర్షితలు ఈ పోటీల్లో సత్తాచాటారు. కోచ్ అఖిలతోపాటు క్రీడాకారులను జిల్లా అధ్యక్షుడు, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఉపాధ్యక్షుడు గోడం జ్యోతిరామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, సభ్యులు మోహన్, నాగరాజ్, రాదేశ్యం, పీఈటీ కవిత, స్నేహలు అభినందించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



గ్యాస్‌ను బయటకు తీసివేస్తున్న సిబ్బంది

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో ఓ ఇంట్లో సోమవారం సిలిండర్ రెగ్యులేటర్ నుంచి మంటలు వ్యాపించాయి. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పేడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. మదనపెల్లి వెంకటి ఇంట్లో భార్య వంట చేస్తుండగా సిలిండర్ రెగ్యులేటర్ నుంచి మంటలు వచ్చింది. వెంటనే ఆమె బయటకు పరుగు తీసింది. ఇరుగుపొరుగువారు ఇసుకను జల్లుతూ మంటలార్పేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. సిలిండర్‌ను దూరంగా తీసుకెళ్లి గ్యాస్‌ను బయటకు తీసివేశారు. దీంతో కాలనీ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఫైర్ సిబ్బంది ఎం.అశోక్, అజయ్, హుస్సేన్ సాహు పాల్గొన్నారు.

రక్తపు వాంతులు చేసుకుని ఒకరి మృతి



గణేశ్ రాథోడ్ (ఫైల్)

ఇంద్రవెల్లి: మండలంలోని హీరపూర్ పంచాయతీ పరిధిలోని లాల్‌టెకిడి గ్రామానికి చెందిన గణేశ్ రాథోడ్ రక్తపు వాంతులు చేసుకుని మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గణేశ్ రాథోడ్(45) కాంగ్రెస్ కార్యకర్త, గ్రామంలో ఆర్ఎంపీ వైద్యుడిగా సేవలందిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఆయన రక్తపు వాంతులు చేసుకున్నాడు. ఆ సమయంలో ఎవరూ లేరు. సాయంత్రం కుటుంబీకులు గమనించి 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య పరిమిళబాయి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

భైంసారూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందాడు. ఎస్సై శ్రీకాంత్, స్థానికులు తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని బోకర్ తాలుకా కాండ్లి గ్రామానికి చెందిన గణేశ్(45) సోమవారం రాత్రి భైంసాకు వస్తున్నాడు. మండలంలోని టాక్లి గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో..

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్‌లోని రాంనగర్ కాలనీకి చెందిన పెరంబదురి వెంకట గోవిందరాజు (55) డీఆర్‌డీఏ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈయన భార్య మాధవీలత ఆదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తోంది. సోమవారం ఆమెను తీసుకువచ్చేందుకు కారులో బయల్దేరాడు. మార్గమధ్యన జాతీయ రహదారిపై ఎదురుగా ఉన్న కంటెయినర్ వాహనాన్ని ఓవర్ టేక్ చేసేక్రమంలో వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకట గోవిందరాజుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

తానూరు: మద్యానికి బానిసై ఒకరు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై నర్సింగ్‌బాను కథనం ప్రకారం.. మండలంలోని కోలూరు గ్రామానికి చెందిన డైలేవార్ మొగ్లాజీ (27) కొన్నినెలలుగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి తాగి ఇంటికి వచ్చాడు. మద్యం తాగడానికి డబ్బులివ్వాలని కుటుంబ సభ్యులను అడిగితే లేవని చెప్పారు. మనస్తాపం చెంది తన పొలానికి వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం రైతులు మృతదేహాన్ని గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఏఎస్సై నర్సింగ్‌బాను పరిశీలించారు. భార్య అర్చన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నాడు.

హత్యాయత్నం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

లక్ష్మణచాంద: హత్యాయత్నం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5,500 జరిమానా విధిస్తూ నిర్మల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అజేశ్‌కుమార్ సోమవారం తీర్పు చెప్పారు. కోర్టుల సమన్వయ అధికారి సక్రియనాయక్ కథనం ప్రకారం.. మండలంలోని రాచాపూర్‌కు చెందిన రాకేశ్(27), అదే గ్రామానికి చెందిన చిన్నాన్న కొడుకైన రజనీకాంత్ (23) మధ్య 9 ఏళ్లుగా భూవివాదంపై గొడవలు జరుగుతున్నాయి. గ్రామపెద్దల సమక్షంలో సమాన కొలతలు చేసి పంచారు. భూమి తక్కువ వచ్చిందని రజనీకాంత్ పలుమార్లు గొడవపడేవాడు. 2022 ఫిబ్రవరి 26న రాకేశ్‌కు చెందిన కోడి తన ఇంట్లోకి రావడంతో రజనీకాంత్ దుర్భాషలాడాడు. ఎందుకు తిడుతున్నావని అడగడంతో నిన్ను చంపి భూమి సొంతం చేసుకుంటానని కత్తితో రాకేశ్‌ను గాయపర్చాడు. రాకేశ్ భార్య జడ సవిత ఫిర్యాదుతో అప్పటి ఎస్సై యూనిస్ అహ్మద్ కేసు దర్యాప్తు చేపట్టారు. కోర్టులో చార్జీషీటు దాఖలు చేసి, రజనీకాంత్‌ను హాజరుపర్చారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.రమణారావు కోర్టులో 13 మంది సాక్షులను విచారించి నేరం రుజువు కావడంతో ఈమేరకు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి తీర్పు వెలువరించారు.

మహిళను కాపాడిన పోలీసులు

భైంసా: బాసర గోదావరి నదిలో సోమవారం ఆత్మహత్య చేసుకునేందుకు చంటిపాపతో వచ్చిన మహిళను పోలీసులు కాపాడారు. బాసర ఎస్సై గణేశ్ కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం కోస్లి గ్రామానికి చెందిన చందన చంటిపాపతో గోదావరి నది వద్ద అటు ఇటు తిరుగుతూ కనిపించింది. యువకుడు అబ్బువార్ గౌతం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. వారు అక్కడికిచేరుకుని ఆమె పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. నందిపేట మండలం ఐలాపూర్‌కు చెందిన పోశెట్టితో తనకు వివాహం జరిగిందని ఏడాది క్రితం భర్త జీవనోపాధి కోసం వేరే దేశానికి వెళ్లాడని బాధితురాలు తెలిపింది. ఇంటి సమస్యలతో మూడు నెలల పాపతో ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చినట్లు చెప్పింది. బాధితురాలి కుటుంబీకులను పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బువార్ గౌతంను పోలీసులు అభినందించారు.